రావిపల్లి నారాయణరావు




# మా అబ్బాయి

స్పెషల్ క్లాస్ తీసుకోవటం వలన స్కూలు నుండి బయటకు వచ్చేసరికి బాగా పొద్దుపోయింది. పెందలాడే ఇంటికెళ్ళాలనుకున్నాను. ఉదయం జరిగిన సంఘటన వలన మనసు నా స్వాధీనంలో లేదు. క్లాసులో పాఠాలు కూడా సరిగ్గా చెప్పలేకపోయాను.

సాయంత్రం సికింద్రాబాద్ స్టేషన్లో లోకల్ ట్రైన్ పట్టుకుని మల్కాజ్‌గిరి స్టేషన్లో దిగేసరికి టైమ్ ఏడు దాటింది. స్టేషన్ దాటి ఇంటివైపు నడక సాగించాను. రోడ్డుకి ఒకవైపు ఉన్న మున్సిపల్ దీపాలు మందంగా వెలుగుతున్నాయి. ఉదయం క్లాసులో నేను సహనాన్ని కోల్పోయాను. ఫలితంగా ప్రశాంత్ బాగా దెబ్బలు తిన్నాడు. మరచిపోదామన్నా మరువలేని ఆ సంఘటన నా కళ్ళముందు కదలాడింది...

-ఇతరుల సొత్తు ఆశించకు... ఆపద సమయానైనా అబద్ధాన్ని ఆహ్వానించకు... నిత్యము సరస్వతీదేవిని స్మరించటం మరువకు- క్లాసులో అడుగుపెట్టగానే పిల్లలకు బోధించే నీతి సూత్రాలివి. ఇవే భావి భారత పౌరులకు కావాల్సిన ముఖ్య లక్షణాలని నా నమ్మకం. నేను ఆశించింది చాలావరకు సాధించాను. నా దగ్గర చదువుకున్న విద్యార్థుల్లో చాలామంది ఇప్పుడు ఉన్నత పదవుల్లో ఉన్నారు. మంచి పేరు తెచ్చుకున్నారు.

ఆరోజు ఉదయం పది నిముషాలు ముందుగా స్కూలుకు వెళ్ళాను. బెల్ కొట్టగానే అటెండెన్స్ తీసుకున్నాను. ఆ తర్వాత రోజూ చెప్పినట్టే నీతి సూత్రాలు చెప్పారు పిల్లలు. పాఠం చెప్పాలని టెక్స్టుబుక్ తెరచానో లేదో ద్వారం దగ్గరకొచ్చి నిలబడ్డాడు ప్రసాద్.

తెరిచిన బుక్ టేబుల్ మీద పెట్టి- 'కమిన్' అన్నాను.

స్కూల్ బ్యాగు చేత పుచ్చుకుని లోపలికొచ్చాడు ప్రసాద్.

ఆలస్యానికి కారణం అడిగాను నేను.

'సార్ నా పెన్ను పోయింది. ఇంట్లో వెదికాను. ఎక్కడా కనబడలేదు. రెండురోజుల కింద మా డాడీ కొనిచ్చిన పెన్ అది. బ్యాగ్‌లో పెట్టి రోజూ ఆ పెన్‌ని స్కూల్‌కు తెస్తున్నాను సార్. నిన్నకూడా ఆ పెన్ నా స్కూల్ బ్యాగ్‌లో ఉండటం నేను చూశాను. ఈరోజు స్కూలుకి బయల్దేరే ముందు ఇంట్లో నా బ్యాగ్ తెరచి చూస్తే పెన్ను కనబడలేదు. నేను, డాడీ, మమ్మీ అంతా వెతికాము. అందుకే స్కూల్‌కి రావటం లేటైంది సార్'. చెప్పాడు ప్రసాద్.

'మరి పెన్ దొరికిందా?'

'లేదు సార్- అది క్లాసులోనే పడిపోయుంటుంది. లేకపోతే ఎవరైనా నా బ్యాగులోనిది తీసేసి ఉండొచ్చు.' ప్రసాద్ కళ్ళనుండి బొట బొటా రాలాయి కన్నీళ్ళు.

క్లాసులో ఉన్న పిల్లలందరి బ్యాగ్‌లు తనిఖీ చేసి అతని అనుమానాన్ని నివృత్తి చేసుకోమని ఆదేశించాను. నేను చెప్పిన ప్రకారం ప్రసాద్ అందరి బ్యాగ్‌లు తనిఖీ చేశాడు. ప్రశాంత్ బ్యాగ్ తనిఖీ చేస్తుండగా బ్యాగ్‌నుండి పడింది ప్రసాద్ పెన్ను. నా కోపానికి అవధులు లేకపోయాయి. ఆవేశాన్ని తట్టుకోలేకపోయాను. క్షణంలో కుర్చీని వెనక్కు నెట్టి దూకుడుగా తనవైపు వెళ్ళిన నన్నుచూసి బెదిరిపోయాడు ప్రశాంత్.

'నేను దొంగతనం చేయలేదండి. నన్ను నమ్మండి. ఆ పెన్ను నేను దొంగలించలేదు. ముమ్మాటికీ నిజం.' ఏడుస్తూ చెప్పాడు ప్రశాంత్.

వాడు చెప్పింది వినిపించుకోకుండా చేతిలో ఉన్న బెత్తంతో ప్రశాంత్ వీపు చిట్లగొట్టాను. బాధను తట్టుకోలేక ప్రశాంత్ విలవిలలాడి పోయాడు. వాడి వీపునిండా బెత్తం నిశానులే.

అలా కొట్టినందుకు నేను చాలా బాధపడ్డాను.

'నువ్వు మంచి విద్యార్థివి. ఆ విషయం నాకు తెలుసు. ఆ పెన్‌ను నువ్వు దొంగలించలేదని చెబుతున్నావు. నీ మాట నేను నమ్ముతాను. మరి నీ బ్యాగ్‌లోకి ఆ పెన్ ఎలా వచ్చింది?' అడిగాను నేను.

'ముందురోజు స్కూలునుండి ఇంటికి వెళ్ళేటప్పుడు బస్సులో పెన్ దొరికింది' చెప్పాడు. ప్రశాంత్ సమాధానం నన్ను ప్రశాంతపరచలేదు.

ప్రశాంత్ ఏడుపు కేకలు చెవిని పడ్డాయేమో చేంబర్సులో ఉన్న హెడ్ మాస్టారు క్లాసులోకి దూసుకువచ్చారు హడావుడిగా. పరిస్థితులను తెలుసుకుని నాపై విరుచుకుపడ్డారు. పిల్లల్ని మందలించడంపోయి దున్నపోతుల్ని బాదినట్టు దండించడం తప్పని గడ్డిపెట్టారు. నిజానిజాలు తెలుసుకోకుండా ఒక విద్యార్థిని దొంగ అని ముద్రవేయటం చాలా పొరపాటు అన్నారు. ఆ పెన్ తన బ్యాగ్‌లోకి ఎలా వచ్చిందో మీరు ప్రశాంత్‌ని అడిగారా? అని హెడ్‌మాస్టారు ప్రశ్నించారు.

ప్రశాంత్ ఏడుపు కేకలు చెవిని పడ్డాయేమో చేంబర్సులో ఉన్న హెడ్ మాస్టారు క్లాసులోకి దూసుకువచ్చారు హడావుడిగా. పరిస్థితులను తెలుసుకుని నాపై విరుచుకు పడ్డారు. పిల్లల్ని మందలించడంపోయి దున్నపోతుల్ని బాదినట్టు దండించడం తప్పని గడ్డి పెట్టారు. నిజానిజాలు తెలుసుకోకుండా ఒక విద్యార్థిని దొంగ అని ముద్రవేయటం చాలా పొరపాటు అన్నారు.

'నేను ప్రశాంత్‌ను వివరాలు అడిగాను హెడ్‌మాస్టారు...' చెప్పాను.

'వాడేం చెప్పాడు?- ప్రసాద్ పెన్ను దొంగలించానని ఒప్పుకున్నాడా?' నా పక్కనే నిలబడి ఉన్న హెడ్‌మాస్టారు సూటిగా అడిగారు.

హెడ్ మాస్టారు క్లాసులో ఉండటంవల్ల పిల్లలెవరు బెంచీలలో కూర్చోలేదు. నిలబడే ఉన్నారు. తన అవసరం హెచ్చెమ్ గారికి పడుతుందేమోనని పెద్దబంట్రోతు తలుపు పక్కనుంచొని చూస్తున్నాడు.

'దొంగిలించానని చెప్పలేదు. స్కూలునుండి తిరిగి వెళ్తున్నప్పుడు బస్సులో ఆ పెన్ను దొరికిందని చెప్పాడు ప్రశాంత్' చెప్పాను.

'అలాంటి పరిస్థితుల్లో ప్రశాంత్‌పై నేరం మోపడం తప్పుకాదంటారా?'

'ఇతరుల సొత్తుపై ఆశ చూపకూడదు. తనది కాని వస్తువును

దాని సొంతదారుకి అందించాల్సిన బాధ్యత ఉంది కదా... ప్రశాంత్ తన విధిని సక్రమంగా నిర్వహించలేదు. అందుకని'

'అఫ్‌కోర్స్ - వస్తువు తనకు దొరికిందని పెద్దల నోటీసుకో లేక పోలీసు దృష్టికో ప్రశాంత్ తీసుకురావల్సింది. కాని ఆ విషయం ఆ పసివాని మెదడుకు తట్టి ఉండదు. అలా చేయటానికది ఖరీదైన వస్తువుకాదని అతను అభిప్రాయపడి ఉండొచ్చు. వాడిని దోషిగా నిలబెట్టి శిక్షించడం సరికాదని నా ఉద్దేశం' హెడ్మాస్టారు చెప్పారు.

నేను నోరు విప్పలేకపోయాను. ఆ తర్వాత నేను చెప్పినట్టు సారీ చెప్పి ప్రసాద్‌కి పెన్ ఇచ్చాడు ప్రశాంత్.

నేను తీసుకున్న చర్య సరైనదికాదని హెడ్ మాస్టారితో పాటు నా అంతరాత్మ కూడా ఘోషించటంతో నా కళ్ళ నిండా నీళ్ళు పేరుకున్నాయి. హెడ్మాస్టారు గమనించారనుకుంటాను. 'రామకృష్ణగారూ! మీ సంగతి నాకు బాగా తెలుసు. ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులందర్లో మీరు ది బెస్ట్ టీచర్. ఆ విషయం ఇక్కడి వాళ్ళందరికి తెలుసు. ప్రశాంత్ మీ సుపుత్రుడన్న సంగతి కూడా నాకు తెలియనిదికాదు. కొడుకని ఆలోచించకుండా మీరు వాడిని దండించారు. అది మీ నీతినిజాయితీకి నిదర్శనం... నా సలహా ఒకటి- పిల్లల్ని మందలించండి. కాని గట్టిగా కొట్టకండి. సదుద్దేశంతో మీరు నన్ను అర్థం చేసుకోగలరు. 'ఆప్యాయంగా నా భుజాన్ని తట్టి హెడ్మాస్టారు తన చాంబర్స్‌లోకి వెళ్ళారు.'

ఉదయం క్లాసులో జరిగిన సంఘటన నా మనోఫలకం నుండి తొలగిపోలేదు. ఆ విషయాన్ని తలచుకుని నేను బాధపడని క్షణం లేదు.

మల్కాజ్‌గిరి స్టేషన్లో లోకల్ దిగి మెల్లగా ఇంటివైపు దారితీశాను. స్టేషన్ నుండి మా ఇంటికి మూడు ఫర్లాంగుల దూరం ఉంటుంది. షార్ట్‌కట్‌లో తొందరగా ఇంటికి చేరుకోవాలని రైలుపట్టాల పక్కనుండి దారితీస్తారు మా కాలనీ వాసులంతా. అదే మార్గం నేను అనుసరించాను. దూరాన ఉన్న మున్సిపల్ లైట్ల వెలుగు రైలుపట్టాలపై పడుతోంది. వర్షం వచ్చే సూచనలు కనబడ్డంవల్ల జనసంచారం బాగా తగ్గిపోయింది. రైలుపట్టాల మధ్య వేయటానికి కాబోలు అక్కడక్కడ చిన్న రాళ్ళ కుప్పలు చోటుచేసుకుని ఉన్నాయి. అలా ఒక ఫర్లాంగు దూరం నడచి వెళ్ళానో లేదో రాళ్ళ కుప్పకి, పక్కనున్న ముళ్ళపొదలకి మధ్య కొట్టొచ్చినట్టు కనిపించింది ఒక తెల్ల కవరు. పాపం ఎవరు జారవిడుచుకున్నదో... కుప్ప దగ్గరకు వెళ్ళాను. కవరు తీసుకోనా వద్దా అని కాస్సేపు తటపటాయించాను. చుట్టూ చూశాను. ఎవరూ కనబడ్లేదు. కిందకు వంగి పొదచాటున ఉన్న కవరు తీశాను. ఆశయం ఒకటి ఆచరణ యింకొకటి- అని అంతరాత్మ పరిహసించింది. కాని నేను పట్టించుకోలేదు. కవరు రెండువైపులా చూశాను. పేరు ఊరు ఎక్కడా రాసి లేదు. కవరు తెరచి ఉంది. లోన ఉన్న వంద రూపాయి నోట్లు కనిపించాయి. మొత్తం పది నోట్లు ఉన్నాయి. ఎవరు పోగొట్టుకున్నారో... వెనక్కి తిరిగాను- ఎవరో పరిగెత్తుకుంటూ వస్తున్నారు, కవరుకోసమే అనుకుంటాను. వస్తున్న ఆ మనిషి కంటబడగానే చల్లని వాతావరణంలో చమట్లు పోసింది శరీరం. ఆ వ్యక్తి నాదగ్గరకు రాలేదు. పక్కనున్న చెట్టుచాటున అత్యవసరమైన తన పని ముగించుకుని వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు. మరో పక్కనుండి ఖాకీ దస్తులు వేసుకున్న వ్యక్తి సుడిగాలిలా రావటం కనిపించింది. తను పోలీసే అయి ఉండాలి. సందేహంలేదు. ఈ కవరుకోసమేనేమో! శరీరం జలధరించింది. భయంతో కళ్ళు మూసుకున్నాను.

'మాస్టారూ బొలారం లోకల్ వెళ్ళిపోయిందా?'

కళ్ళు తెరిచాను- ఖాకీబట్టలు తొడిగి ఉన్న మనిషి అడుగుతున్నాడు.

'అది వెళ్ళి పది నిముషాలైంది' చెప్పాను. అతను వెళ్ళిపోయాడు.

ఎదురుపడ్డ మనుషులంతా పోలీసుల్లా నా కంటికి కనిపించసాగారు. దానికి కారణం నా చేతిలో ఉన్న వెయ్యి రూపాయల కవరని తెలుసుకోటానికి నాకు ఎంతోసేపు పట్టలేదు. కవరు నా చేతిలో ఉండటం ఏమాత్రం మంచిది కాదని మనసు హెచ్చరించింది. మరో క్షణం ఆలస్యం చేయలేదు. వెనక్కు వెళ్ళి పొదలచాటున యథాస్థానంలో వెయ్యి రూపాయలతో ఉన్న కవరు పెట్టి ఇంటిముఖం పట్టాను. మనసులో మరెలాంటి ఆందోళనలు లేవు. ప్రశాంతంగా ఉంది.



ఇల్లు చేరేసరికి బాగా పొద్దుపోయింది. లైట్లు వెలుగుతున్నాయి. కాని హాల్లో ప్రశాంత్‌గాని, కృష్ణవేణి గాని కనిపించలేదు. కుడివైపునున్న నా బెడ్‌రూమ్‌లో కాలుపెట్టాను. మంచం మీద కూర్చుని ఉన్న నా శ్రీమతి కృష్ణవేణి మొహంలో కళాకాంతులు లేవు. ఆమె ఎందుకలా ఉంది?

ఇల్లు చేరేసరికి బాగా పొద్దుపోయింది. లైట్లు వెలుగుతున్నాయి. కాని హాల్లో ప్రశాంత్‌గాని, కృష్ణవేణి గాని కనిపించలేదు. కుడివైపునున్న నా బెడ్‌రూమ్‌లో కాలుపెట్టాను. మంచం మీద కూర్చుని ఉన్న నా శ్రీమతి కృష్ణవేణి మొహంలో కళాకాంతులు లేవు. ఆమె ఎందుకలా ఉంది? స్కూల్లో జరిగిన సంఘటన ప్రశాంత్ చెప్పి ఉండొచ్చు. లేకపోతే ఆమె వాడి వీపుమీద కనబడ్డ దెబ్బలుచూసి విషయాన్ని అడిగి తెలుసుకుందేమో... నా అడుగుల చప్పుడు విని కృష్ణవేణి లేచి నుంచుంది. కళ్ళు తుడుచుకుంది. నా చేతిలో ఉన్న సంచిని, భుజంమీద వేసుకున్న కండువాను అందుకుని పక్కన పెట్టింది.

'అవును కృష్ణా- ప్రశాంత్ ఎక్కడ? కోపాన్ని కంట్రోల్ చేసుకోలేకపోయాను కృష్ణా. వెధవని బెత్తంతో చాలా దెబ్బలు కొట్టాను. బాబు అన్నం తిన్నాడా? అలాగే వెర్రి నాగమ్మ నిద్రపోయాడా?? నేను ఇంటికి రాగానే నా రాకను తెలుసుకుని గదిలోకి ఒక్క అంగలో ఉరికి వచ్చేవాడు. ఏడీ- బాబు ఎక్కడున్నాడు?' నేను ప్రశ్నల వర్షం కురిపించాను.

'మీకో విషయం చెప్పాలి...' కళ్ళల్లో పేరుకొన్న నీళ్ళు తుడుచుకుంటూ అంది కృష్ణవేణి.

''ఏ విషయం?' అడిగాను సోఫాలో కూర్చుని.

'మీ స్నేహితుడు- అదేనండి అప్పారావుగారి అబ్బాయికి యాక్సిడెంట్ జరిగినప్పుడు మీరు వెయ్యి రూపాయలు అప్పుగా ఇచ్చారట. ఆ డబ్బు ఇంటికొచ్చి ఇస్తానని నిన్న లాలాగూడనుండి ఫోన్ చేసి చెప్పారు. ఆ విషయం మీకు నిన్న రాత్రే చెప్పాను' కృష్ణవేణి చెప్పింది.

'అవును' అన్నాను.

'కాని ఆయన ఇంటికి రాలేదు. మల్కాజ్‌గిరి స్టేషన్లో ఆయన ఈ సాయంత్రం కనబడి పది వంద రూపాయల నోట్లతో ఉన్న కవరొకటి ప్రశాంత్ చేతిలోపెట్టి హడావిడిగా స్టేషన్లో ఉన్న రైలువైపు పరుగెత్తారట. ఆ వెయ్యి రూపాయల కవరు నోట్ బుక్‌లో పెట్టి ఇంటికొచ్చాడు ప్రశాంత్. రాగానే ఆ డబ్బు నాకివ్వాలని నోట్ బుక్ వెదికాడు. కాని కవరు కనిపించలేదు. అప్పటినుంచి ఒకటే ఏడుపు. భోజనంకూడా చెయ్యలేదు...!- చెప్పుకుపోతోంది కృష్ణవేణి.

తర్వాత మాటలు నా చెవిని పడలేదు. కొన్ని క్షణాలు నేను అవాక్కయిపోయాను.

వెయ్యి రూపాయలతో కవరు- మల్కాజ్‌గిరి స్టేషన్... అవును, పట్టాల పక్కన దొరికిన కవరు ప్రశాంత్ నోట్‌బుక్‌నుంచి జారిపడినదే... సందేహం లేదు. టైమ్ తొమ్మిది కావస్తోంది. చీకట్లో అక్కడికి వెళ్ళి వెదికితే- ప్రయోజనం ఉంటుందా? ఏమో... రోజులు బాగులేవు. ఉన్మాదులు, ఉగ్రవాదులు చీకట్లో తిరుగుతూ అల్లరులు సృష్టిస్తున్నారట, ఆస్తులు డేమేజ్ చేస్తున్నారట. వాళ్ళను అదుపులోకి తీసుకోటానికి పోలీసులు మఫ్టీలో గస్తీ తిరుగుతూ చాలా అప్రమత్తంగా ఉన్నారట. ఈ పరిస్థితుల్లో రాత్రివేళ రైలుపట్టాల దగ్గర పోయిన డబ్బుకోసం గాలించటం సామాన్య విషయం కాదు. చాలా రిస్కుతో కూడిన పని. వీడు ఉన్మాదో ఉగ్రవాదో రైలుపట్టాలు పీకడానికి వచ్చాడన్న నేరంకింద పట్టుకుని... అమ్మో తలచుకుంటుంటే గుండె ఆగినంత పనవుతోంది. ఆ రిస్క్ మనకొద్దు... పోతే పోయింది వెయ్యి రూపాయలు.

'ఏవిటండీ... ఏవిటాలోచిస్తున్నారు?' అడిగింది కృష్ణవేణి.

'ఏడీ- ప్రశాంత్ ఎక్కడ?' అడిగి నేను సమాధానం కోసం ఎదురు చూడలేదు. పక్క గదిలోకి నడిచాను.

'వద్దండీ- వాడిని ఏమీ అనొద్దు. ఉదయం మీరు కొట్టిన దెబ్బల నొప్పి ఇంకా తగ్గలేదట, బాధపడుతూ వచ్చాడు. తర్వాత, వెయ్యి రూపాయల కవరు నోట్ బుక్ నుండి జారిపోయిందని తెలిసినప్పటినుండి వాడి పరిస్థితి గోరుచుట్టుమీద రోకటి పోటైంది. స్కూలు నుండొచ్చాక భోజనం కూడా చేయలేదు. సొమ్మసిల్లి మంచం మీద పడిపోయాడు వెర్రి నాగమ్మ. ప్లీజ్- వాడ్నేమీ అనకండి. వాడ్ని కొడితే నా మీద వొట్టే'

నా వెంట పరుగెత్తుకొచ్చింది కృష్ణవేణి. కాని నేను ఆమె వైపు తిరగలేదు. ఆమె ఉనికినీ పట్టించుకోలేదు. మంచం మీద కూర్చుని పక్కనున్న ఆయింట్‌మెంట్ తీసి పడుకుని ఉన్న ప్రశాంత్ వీపుమీద మెలమెల్లగా రాసి మునివేళ్ళతో నిమిరాను. నా బంగారు బాబుపై కొద్దిగా వాలి వాడ్ని గుండెలకు హత్తుకున్నాను. అదే క్షణంలో రెండు కన్నీటి బిందువులు నా పాదాల మీద రాలాయి... తలపైకెత్తి చూశాను. నేను కూర్చున్న మంచం పక్కనే కృష్ణవేణి నిలబడి ఉంది. ఆమె చెక్కిళ్ళు రెండూ కన్నీటితో తడిసి ఉన్నాయి. ★